
ఆంధ్రజ్యోతి
రంజాన్ వేళలు | ఇఫ్తార్: 6.33 | సహర్: 4.58 (గురువారం)
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
బుధవారం 20 మార్చి 2024

చికెన్ ధరలు
గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.126	183	208
సూర్యాపేట	రూ.120	180	210
నల్లగొండ	రూ.126	184	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 35.5 , కనిష్ఠం 23.0

భువనగిరి ప్రతిష్ఠాత్మకం



సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. లోక్‌సభ ఎన్నికలను ప్రధాన పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. రాష్ట్రంలో పట్టు నిలుపుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తుండగా, గత వైభవాన్ని చాటుకునేందుకు బీఆర్‌ఎస్, తెలంగాణలో పాగా వేసేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తున్నాయి. అన్ని పార్టీల అధిష్ఠానాలు అభ్యర్థుల ఎంపిక విషయంలో ఇప్పటికే సర్వేలు నిర్వహించాయి. అయితే సర్వేల్లో వచ్చిన అనుకూల, ప్రతికూల పరిస్థితులను అనుసరించి అభ్యర్థుల ఎంపిక విషయంలో అచితూచి అడుగులు వేస్తున్నాయి. ప్రధాన పార్టీలు బలమైన అభ్యర్థిని రంగంలోకి దింపేందుకు తీవ్ర కసరత్తు చేస్తూ గెలుపు గుర్రాలపై దృష్టి కేంద్రీకరించాయి. - (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

» గెలుపు గుర్రాలపై నజర్ » ప్రధాన పార్టీల్లో అభ్యర్థుల కోసం కసరత్తు » రెండు రోజుల్లో రానున్న స్పష్టత » ఇప్పటికే బీజేపీ అభ్యర్థులు ఖరారు

భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో సామాజికంగా, ఆర్థికంగా, పార్టీ పరంగా ఉన్న పరిస్థితులకు అనుగుణంగా అభ్యర్థులను రంగంలోకి దించేందుకు అన్ని పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి. మరోవైపు లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ఈసీఐ విడుదల చేసింది. అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో నిమగ్నమైంది. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రధాన పార్టీల్లో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఇప్పటికే బీజేపీ అధిష్ఠానం భువనగిరి, నల్లగొండ పార్లమెంట్ స్థానాలకు పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. బీఆర్‌ఎస్ సైతం పార్టీ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేసినా, అధికారికంగా రెండో రోజుల్లో వెల్లడించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇక కాంగ్రెస్ నల్లగొండకు అభ్యర్థిని ప్రకటించినప్పటికీ, భువనగిరి ఎంపీ అభ్యర్థి విషయంలో సీరియస్‌గా కసరత్తు చేస్తోంది. ఒకటి రెండురోజుల్లో కాంగ్రెస్ అధిష్ఠానం సైతం తుది నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది. ఎంపీ అభ్యర్థుల ఎంపిక విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ గతంలో ఎన్నడూ లేనంత సమాలోచనల్లో నిమగ్నమయ్యాయి. మరోవైపు పలు పార్టీల్లో బలమైన నేతలు పోటీ చేసేందుకు సిద్ధంగా లేకపోవడం అధిష్ఠానాలకు తలనొప్పిగా మారింది. ఈసారి జరిగే లోక్‌సభ ఎన్నికలు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల అభ్యర్థుల మధ్య త్రిముఖ పోటీ ఉండనుంది. నియోజకవర్గాల్లో త్వరలో ప్రచారం హోరెత్తనుంది.

కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం మొదటి జాబితాలో నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి తనయుడు రఘువీర్‌రెడ్డికి అవకాశం కల్పించింది. జానారెడ్డి తన రాజకీయ వారసులుగా ఇద్దరు కుమారులు రాజకీయ అరంగ్రేటం చేశారు. ఇప్పటికే నాగార్జునసాగర్ ఎమ్మెల్యేగా ఆయన కుమారుడు జైవీర్‌రెడ్డి గెలిపించుకున్న ఆయన, అధిష్ఠానాన్ని ఒప్పించి నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి తన తనయుడికి టికెట్‌ను ఇప్పించుకోగలిగారు. ఈ మేరకు నల్లగొండలో ఆయన ప్రచారాన్ని ముమ్మరం చేయనున్నారు. భువనగిరి పార్లమెంట్ స్థానం విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. సోమవారం ఢిల్లీలో అభ్యర్థుల ఎంపికపై సీఈసీ సమావేశమైంది. ఏ నియోజకవర్గాల్లో ఎవరెవరిని బరిలో దించాలనే అంశంపై చర్చించింది. అయితే భువనగిరి అభ్యర్థి విషయంపై రాష్ట్ర నాయకత్వంతో భేటీ అయి కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. రెండో జాబితాలో అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉంది. దీంతో భువనగిరి నియోజకవర్గంలో రోజురోజుకూ రాజకీయ వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ స్థానం నుంచి పోటీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీలోని నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు ప్రస్తుత మంత్రి కోమటిరెడ్డి సోదరుడి

అభ్యర్థులపై నేడే రేపో కీలక నిర్ణయం

తనయుడు డాక్టర్ సూర్యపవన్‌రెడ్డితో పాటు పలువురు టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. తాజాగా, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు అమిత్‌రెడ్డి, భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పేర్లు సైతం తెరపైకి వచ్చాయి. గుత్తా సుఖేందర్‌రెడ్డి సైతం తన తనయుడిని రాజకీయ అరంగ్రేటం చేయించాలని చూస్తున్నారు. ఈ మేరకు బీఆర్‌ఎస్‌ను భువనగిరి స్థానం నుంచి తన కుమారుడిని ఎంపీ అభ్యర్థిగా ప్రకటించాలని కోరారు. అయితే బీఆర్‌ఎస్ నేతల్లో నెలకొన్న విభేదాలతో కాంగ్రెస్ నుంచి టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. పైళ్ల శేఖర్‌రెడ్డి నల్లగొండ జిల్లాలోని పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతల అండదండలతో టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. తనకు భువనగిరి ఎంపీ టికెట్ ఇస్తే కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమని అధిష్ఠానంతో ఆయన చర్చించినట్లు సమాచారం. అయితే కాంగ్రెస్ అధిష్ఠానం మాత్రం రాష్ట్ర పార్టీ నాయకత్వం సూచించిన అభ్యర్థినే ఎంపిక చేస్తామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో భువనగిరి ఎంపీ టికెట్‌పై రాష్ట్ర నాయకత్వం ఎవరిని ఎంపిక చేయాలనే అంశంపై కసరత్తు తుది దశకు వచ్చింది. తమకు అనుకూలంగా ఉన్న అభ్యర్థులను ఎంపిక చేసేందుకు రాష్ట్ర పార్టీ యత్నిస్తోంది. అభ్యర్థి ఎంపికలో పార్టీలోని అగ్ర నేతలు పైచేయి సాధించేందుకు ముమ్మరంగా యత్నిస్తున్నారు.

ప్రచారంలో దూసుకుపోతున్న బీజేపీ



లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణాలో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకునేందుకు బీజేపీ అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. ముందస్తుగానే అభ్యర్థులను ప్రకటించి ప్రచారంలో దూసుకుపోతోంది. భువనగిరి అభ్యర్థిగా, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, నల్లగొండ అభ్యర్థిగా సైదిరెడ్డిని ప్రకటించింది. ఈ మేరకు నియోజకవర్గాల్లో వారు ముమ్మరంగా ప్రచారాన్ని చేపట్టేందుకు స్వయంగా రాష్ట్ర నాయకత్వం షెడ్యూల్‌ను రూపొందించింది. తెలంగాణలో పాగా వేసేందుకు అగ్రనేతలు ప్రచార పర్వంలో దిగనున్నారు. ఇప్పటికే ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షాతోపాటు పలువురు కేంద్ర మంత్రులు బహిరంగ సభలు నిర్వహించారు. ఏ నియోజకవర్గంలో అగ్రనేతలతో ప్రచారాన్ని చేపట్టలనే అంశంపై పార్టీ సమాలోచనలు చేస్తోంది. రాష్ట్రంలో బీజేపీ కనీసం 10 లోక్‌సభ స్థానాల్లో గెలుపొందాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోంది. తమకు అనుకూలంగా ఉన్న స్థానాల్లో ముమ్మరంగా ప్రచారాన్ని చేపట్టాలని యోచిస్తోంది.

రంగంలోకి సీపీఎం

లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి నుంచి పోటీలో ఉంటామని సీపీఎం ఇప్పటికే ప్రకటించింది. ఈ మేరకు పార్టీ కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి భువనగిరి పార్లమెంట్ నుంచి పోటీలో ఉంటారని పార్టీ ప్రకటించింది. వామపక్ష పార్టీల నుంచి సీపీఎం రంగంలో ఉండగా, సీపీఐ సైతం రాష్ట్రంలో ఒక ఎంపీ స్థానాన్ని కేటాయించాలని కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కోరింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తీసుకునే నిర్ణయంపై సీపీఐ పోటీచేసే స్థానాలు ఆధారపడి ఉన్నాయి. సీపీఎం ఒంటరిగానే పోటీకి సిద్ధమైంది.

అభ్యర్థుల ఎంపికకు బీఆర్‌ఎస్ కసరత్తు పూర్తి

బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పూర్తయినట్టు సమాచారం. రెండు రోజుల్లో అధికారికంగా ప్రకటించడమే తరువాయి అని పార్టీ సీనియర్‌నేతలు చెబుతున్నారు. గతంలో బీఆర్ఎస్ సారు.. కారు.. పదహారు నినాదంతో ముందుకు వెళ్లగా, ఈసారి ఆచితూచి అడుగులు వేస్తోంది. బీఆర్ఎస్ ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఓటమిని చవిచూసింది. ఉద్యమ పార్టీ అయి ఉండి, చాలా చోట్ల భారీ ఓట్ల మెజార్టీతో అభ్యర్థులు ఓడిపోవడాన్ని జీర్ణించుకోలేకపోతోంది. ఈ నేపథ్యంలో పార్టీ అభ్యర్థుల ఓటమికి కారణాలను విశ్లేషించింది. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కైవసం చేసుకునేందుకు ఆ పార్టీ అగ్రనేతలు భేటీలు నిర్వహిస్తున్నారు. నల్లగొండ అభ్యర్థిగా కంచర్ల కృష్ణారెడ్డి, భువనగిరి అభ్యర్థిగా బూడిద భిక్షమయ్యగౌడ్‌ను అభ్యర్థులుగా అధిష్ఠానం నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. రెండు రోజుల్లో అధికారికంగా అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. స్థానిక రాజకీయ పరిస్థితులను బట్టి ఆ పార్టీ నిర్ణయం తీసుకునే అవకాశం కూడా లేకపోలేదు.



స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా రథోత్సవం

చూడముచ్చటగా యాదాద్రీశుడికి వెండి గరుడసేవ



యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి వార్షిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి రథోత్సవం వైభవంగా సాగింది. ఉదయం లక్ష్మీనరసింహుల వెండి గరుడవాహన సేవ చూడముచ్చటగా కొనసాగింది. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా తిరుకల్యాణ వేడుకలు కొనసాగగా.. మరుసటి రోజున ఉదయం లక్ష్మీనాథుడైన స్వామివారు విష్ణుమూర్తి అలంకారంలో తన ఇష్టవాహనమైన గరుత్మంతుడి వాహనంపై దేవేరి శ్రీమహాలక్ష్మీ అమ్మవారి సమేతంగా ఆలయ తిరువీధుల్లో ఊరేగారు. అలంకార శోభితుడు లక్ష్మీనృసింహులను వేదస్వరూపుడైన వెండి గరుడ వాహనంపై అధిష్ఠింపజేసి వేద పండితులు, పారాయణీకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ గరుడవాహన సేవోత్సవం, రాత్రికి రథోత్సవం నిర్వహించారు. - యాదగిరిగుట్ట

●7లో..



నృసింహుడికి వెండి గరుడ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయవద్దు

కలెక్టర్ ఎస్.వెంకట్రావ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట(కలెక్టరేట్), మార్చి 19: జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎలాంటి అధికారిక ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేపట్టవద్దని కలెక్టర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఎంసీసీ నోడల్ అధికారి సతీష్ కుమార్‌తో కలిసి నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల కోడ్‌కు ముందు జరుగుతున్న పనులు, అనంతరం ఉన్న పనులు, టెండర్ ప్రక్రియలో గల పనుల వివరాలను వెంటనే అందజేయాలన్నారు. ఎన్నికల కోడ్‌కు ముందు జరుగుతున్న పనులు యథావిధిగా కొనసాగించవచ్చన్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితులు ఉన్నందున ఎక్కడ కూడా నీటి ఎద్దడి రాకుండా చూడాలన్నారు. సమావేశంలో పీఆర్ ఈఈ వెంకటేశ్వర్‌రావు, ఇరిగేషన్ ఈఈ రమేష్, ఆర్‌అండ్‌బీ ఈఈ భాస్కర్‌రావు, టీఎస్ఐడీసీ రమేష్, సూర్యాపేట మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్, డీఈ జీకేడీ ప్రసాద్ పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను పరిష్కరించాలి

● ఎస్పీ రాహుల్ హెగ్డే



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

సూర్యాపేటక్రైం, సూర్యాపేట రూరల్, మార్చి 19: పోలీస్‌స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలని ఎస్పీ రాహుల్‌హెగ్డే బీకే అన్నారు. మంగళవారం పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన సూర్యాపేట సబ్‌డివిజన్ పోలీస్ అధికారుల సమీక్షా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు.డయల్100 ఫిర్యాదులపై వెంటనే స్పందించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం మత్తులో నిర్లక్ష్యంగా వాహనాలు నడిపే వారిని గుర్తించి కేసులు నమోదు చేయడంతో పాటు వాహనాలను సీజ్‌చేయాలన్నారు. అంతకుముందు సూర్యాపేట-జనగాం క్రాస్ రోడ్డు జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీని పరిశీలించారు. సమావేశంలో సూర్యాపేట డీఎస్పీ జి.రవి, డీసీఆర్ బీ డీఎస్పీ మట్టయ్య, సీఐలు జి. రాజశేఖర్, వై.సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్, రఘువీర్‌రెడ్డి పాల్గొన్నారు.

రెండోరోజూ ప్రశాంతంగా 'పది' పరీక్షలు



విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధికారులు

సూర్యాపేటఅర్బన్, మార్చి 19: జిల్లాలో పదో తరగతి పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా కొనసాగాయి. రెండో రోజు హిందీ పరీక్ష కొనసాగింది. జిల్లాలో 67 పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు. కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బంది ల్లేకుండా అన్ని రకాల వసతులు కల్పించారు. జిల్లాలో మొత్తం 11,933 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 11,893 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 40 మంది గైర్హాజరయ్యారని డీఈవో అశోక్ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ అమలులో కేంద్రం విఫలం

సూర్యాపేటటౌన్, మార్చి 19: ఎస్సీవర్గీకరణ అమలు చేయడంలో కేంద్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టీ.ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సిరిసనోళ్ల బాలరాజు అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ఓ హోటల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 25ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు అనేక కమిటీలు వేస్తూ కాలయాపన చేస్తోందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో మాదిగలకు రెండు ఎంపీ సీట్లు కేటాయించాలని డిమాండ్‌చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితబంధు పథకం, పారిశుధ్య కార్మికులను ఆదుకోవడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో టీ.ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కత్తి ఉపేందర్, బాషపంగు సత్యం, కొండగడుపుల సూరయ్య, పాతకొట్ల రమేష్, వల్లాస్ శంకర్, కమల్, కోటయ్య, వెంకన్న, రాంబాబు, పాల్గొన్నారు.

నేడు తిరుమలగిరి 'మునిసిపల్' అవిశ్వాసం



క్యాంపుల నుంచి కార్యాలయానికి రానున్న కౌన్సిలర్లు

తిరుమలగిరి, మార్చి 19: తిరుమలగిరి మునిసిపాలిటీలో నేడు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నారు. చైర్మన్, వైస్‌చైర్మన్‌లపై కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మాన సమావేశానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. గత నెల 26న చైర్మన్, పోతరాజు రజని, వైస్‌చైర్మన్ సంకెపల్లి రఘునందన్‌రెడ్డిలపై 10 మంది కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేసి కలెక్టర్ వెంకట్రావుకు అందజేసిన విధితమే. కలెక్టర్ ఈ నెల 20వ తేదీన అవిశ్వాస కార్యక్రమం పెట్టాల్సిందిగా ఆదేశించారు. నేడు మునిసిపల్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు చైర్మన్‌పై అవిశ్వాస కార్యక్రమం, మధ్యాహ్నం ఒంటి గంటకు వైస్‌చైర్మన్‌పై అవిశ్వాస కార్యక్రమం నిర్వహించనున్నారు. అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తే పద్ధతి ద్వారా కార్యక్రమం నిర్వహించనున్నారు.

క్యాంపు నుంచి నేరుగా అవిశ్వాసానికి హాజరు

అవిశ్వాసానికి హాజరుకావడానికి క్యాంపులో ఉన్న కౌన్సిలర్లు నేరుగా మునిసిపల్ కార్యాలయానికి చేరుకోనున్నట్లు తెలుస్తోంది. మొదట అవిశ్వాసంపై 10మంది కౌన్సిలర్లు సంతకాలు చేసి, క్యాంపునకు వెళ్లగా,సోమవారం రాత్రి మరో ఇద్దరు 6వ వార్డు నుంచి శ్రీలత, 13వ వార్డు నుంచి సరిత బీఆర్ఎస్ కౌన్సిలర్లు కూడా క్యాంపునకు వెళ్లారు. ఇప్పుడు అవిశ్వాసానికి మద్దతుగా ఉన్న కౌన్సిలర్ల సంఖ్య 12కు పెరిగింది. ఎక్స్ అఫీషియో ఓటు లేకుండానే అవిశ్వాసం గెలిచే అవకాశాలు ఉన్నట్లు భావిస్తున్నారు.

అవిశ్వాసంపై ఎమ్మెల్యే ప్రమేయం లేదు

చైర్మన్, వైస్‌చైర్మన్‌లపై పెట్టిన అవిశ్వాసంపై ఎమ్మెల్యే మందుల సామేలు ప్రమేయం లేదని కౌన్సిలర్లు తెలిపారు. మంగళవారం క్యాంపులో ఉన్న కౌన్సిలర్లు ఓ లేఖలో ఈ విషయం పేర్కొన్నారు. పోతరాజు రజని చైర్‌పర్సన్‌గా ఎన్నికైన దగ్గరనుంచి అవినీతి అక్రమాలకు పాల్పడడం, తీర్మానాలు లేకుండా అధికారులతో కుమ్మక్కై బిల్లులు కాజేశారని తెలిపారు. కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఇష్టారాజ్యంగా నియమించడం, కౌన్సిలర్లను లెక్కచేయకపోవడం, సమావేశాలను నిర్వహించకపోవడం వల్ల అవిశ్వాసం పెట్టినట్లు తెలిపారు. చైర్‌పర్సన్ చేసిన అవినీతిని బయటపెడతామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శాగంటి అనసూయ, గిలకత్తుల ప్రియలత, పొన్న రాజ్యలక్ష్మి, కన్నెబోయిన రేణుక, పత్తెపురం సరిత, కుదురుపాక శ్రీలత పాల్గొన్నారు.

మొత్తం 15 వార్డుల్లో..

చైర్మన్, వైస్‌చైర్మన్‌లపై పెట్టిన అవిశ్వాసం నెగ్గే అవకాశాలు కన్పిస్తున్నాయి. తిరుమలగిరి మునిసిపాలిటీలో మొత్తం 15 వార్డుల్లో 2019 ఎన్నికల్లో బీఆర్ఎస్ 11, కాంగ్రెస్ 4 స్థానాలు గెలుపొందాయి. 2వవార్డు సభ్యుడు హన్మంతు కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరారు.గత అసెంబ్లీ ఎన్నికల్లో ముగ్గురు కౌన్సిలర్లు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్‌కు ఆరుగురు సభ్యులయ్యారు. ఇప్పుడు అవిశ్వాస కార్యక్రమం సందర్భంగా ఐదుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాసానికి మద్దతుగా వెళ్లగా, ప్రస్తుత బలాబలాలు కాంగ్రెస్ 11, బీజేపీ 1, బీఆర్ఎస్ 3, ఈ సంఖ్యాబలాలతో అవిశ్వాసంనెగ్గనున్నట్లు తెలుస్తోంది.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

సుదాకర్ పీవీసీ మేనేజింగ్ డైరెక్టర్ మీలా మహదేవ్

సూర్యాపేటటౌన్, మార్చి 19: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సుదాకర్ పీవీసీ మేనేజింగ్ డైరెక్టర్ మీలా మహదేవ్ అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా 'మన పర్యావరణం- మన బాధ్యత' అనే అంశంపై రాష్ట్రస్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించే కార్యక్రమం సందర్భంగా ఆయనకు గ్రీన్‌క్లబ్ ట్రస్టు ఆధ్వర్యంలో పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 8వ తేదీ నుంచి 30 రోజుల పాటు జాతీయ సైన్స్‌డే సందర్భంగా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ పోటీలకు 5వేల మంది విద్యార్థులు హాజరయ్యారని, 15వేల మంది విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. 500మంది విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చగా వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ముప్పారపు నరేందర్, తోట కిరణ్, ఉప్పల శ్రవణ్, నాగేశ్వర్‌రావు, వనమాల వెంకటేశ్వర్లు, అంజన్‌ప్రసాద్ పాల్గొన్నారు.



మీలా మహదేవ్‌కు పూలమొక్కను అందజేస్తున్న గ్రీన్‌ట్రస్టు సభ్యులు

ఫాసిస్టు విధానానికి వ్యతిరేకంగా మహిళలు పోరాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న కొత్తపల్లి రేణుక

తుంగతుర్తి, మార్చి 19: కేంద్ర ప్రభుత్వ ఫాసిస్టు విధానానికి వ్యతిరేకంగా మహిళలు పోరాడాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళా సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2016 నుంచి బేటీ బచావో-బేటీ పడావో నినాదం, ఆత్మనిర్భర భారత్, వికసిత భారత్, అచ్చేదిన్‌లాంటి నినాదాలు అద్భుతంగా అనిపించాయన్నారు. కానీ విద్య, ఉపాధి వేతనాల్లో అడుగడుగునా స్త్రీలు వివక్ష ఎదుర్కొంటున్నారన్నారు. మహిళల సంక్షేమంకోసం చట్టాలను ఎన్ని చేసినా దేశంలో, రాష్ట్రంలో మహిళలపై దాడులు, హత్యలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హయాంలో అట్టడుగువర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వం కొమ్ము కాస్తూ సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో మతోన్మాద బీజేపీకి బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బోయిని నాగమ్మ, నర్మద, జీడి అరుణ, గుండాల నీలమ్మ, మల్లమ్మ, కలమ్మ, పద్మ, సోమక్క తదితరులు పాల్గొన్నారు.

రూ.23.14లక్షల నగదు, మద్యం స్వాధీనం

ఆత్మకూరు(ఎస్)నార్కట్‌పల్లి, దామరచర్ల,కోదాడరూరల్, తిప్పర్తి, మద్దిరాల, మార్చి 19: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అనుమతికి మించి తరలిస్తున్న రూ.23.14 లక్షల నగదుతో పాటు అక్రమంగా నిల్వ చేసిన రూ. 42,170 విలువైన మద్యాన్ని, రూ. 1.96 లక్షల విలువ చేసే మిక్సీలు, గ్యాస్ స్టవ్‌లు, రైస్ కుక్కర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

● నార్కట్‌పల్లి పరిధిలోని హైదరాబాద్-విజయవాడ రహదారిపై ఏర్పాటుచేసిన చెక్‌పోస్టుల వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఎలాంటి ఆధారాలు లేకుండా ముగ్గురి వద్ద ఉన్న రూ. 3,04,500ల నగదుతో పాటు పలు గ్రామాల్లోని బెల్ట్‌షాపుల్లో నిల్వచేసిన రూ. 32,170 విలువైన మద్యంబాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు.

●ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరుకు చెందిన పెనక గోపీనాథ్ తన కారులో హైదరాబాద్ నుంచి నెల్లూరుకు రూ.9.50 లక్షల నగదుతో వెళ్తున్నాడు. దామరచర్ల మండలం వాడపల్లి చెక్‌పోస్టు వద్ద నిర్వహించిన తనిఖీల్లో నగదుకు సంబంధించిన ఆధారాలు చూపించకపోవడంతో స్వాధీనం చేసుకుని మిర్యాలగూడ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించినట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

● ఏపీ రాష్ట్రం నుంచి హైదరాబాద్ వెళుతుండగా సూర్యాపేట జిల్లా కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద ఐదు కార్లలో తనిఖీచేసి మొత్తం రూ.4,76,900 నగదును గుర్తించినట్లు ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

●నల్లగొండజిల్లా మిర్యాలగూడలోని సాగర్‌రోడ్డుపై నిర్వహించిన తనిఖీలో ఓ కంపెనీ డిటర్జెంట్ పౌడర్ సప్లయ్ డీలర్ గంగుల రాంబాబు ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.84వేల నగదును సీజ్‌చేశారు.

● సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల పరిధిలోని ఖమ్మం జిల్లా సరిహద్దు శాంతినగర్ వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్టులో రూ.1.96 లక్షలు విలువ చేసే మిక్సీలు, గ్యాస్ స్టవ్‌లు, రైస్ కుక్కర్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపారు. ఖమ్మం నుంచి డీసీఎం వ్యాన్‌లో కోదాడకు వస్తుండగా, చెక్‌పోస్టు వద్ద వ్యాన్‌ను తనిఖీ చేయగా, ఈ వస్తువులు బయట పడ్డాయన్నారు.

● తిప్పర్తి మండలం చిన్నసూరారం గ్రామానికి చెందిన జక్కలి సతీష్ తన నివాసంలో బెల్ట్ షాపు నిర్వహిస్తుండగా ఎఫ్ఎస్‌టీ టీం ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి రూ.10వేల విలువ చేసే 14 బీర్లు, 10 ఐబీ మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు.

● సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలంలో పరిమితికి మించి తీసుకెళ్తున్న రూ. 2.50లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మధునాయుడు తెలిపారు. మండలంలోని కుంటపల్లి చెక్‌పోస్టు వద్ద హన్మకొండ జిల్లా అన్నెపర్తి మండలం జైపూర్ గ్రామానికి చెందిన బొజ్జ సుభాష్ మిర్చి కొనుగోలు కోసం స్వగ్రామం నుంచి దంతాలపల్లి మీదుగా రూ.56,430 తీసుకెళ్తుండగా పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు.

● సూర్యాపేట జిల్లా ఆతకూర్(ఎస్) మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన నాగమల్లు రూ.1.93 లక్షలు పత్తి కొనుగోలు కోసం తీసుకెళ్తుండగా పట్టుకుని సీజ్ చేశామన్నారు.

● మద్దిరాల మండల కేంద్రంలోని బెల్ట్‌షాపుల్లో తనిఖీలు నిర్వహించి సుమారు రూ.5 వేల విలువైన మద్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి చెక్‌పోస్టు వద్ద ఏపీ వెళ్తున్న వాహనంలో అనుమతికి మించి ఉన్న రూ.9.50 లక్షలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

ప్రభుత్వ మద్దతుతోనే మహిళా రైతులపై హింస కనుమరుగు

● వ్యవసాయ సంక్షోభం నేపథ్యంలో మహిళా రైతులపై వ్యవస్థీకృత హింస : స్వభావం, రూపాలపై వర్క్‌షాప్





వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న నల్లగొండ జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్, హాజరైన మహిళలు

మహిళా రైతుల ఇబ్బందులు తీర్చేందుకు చర్యలు తీసుకోవాలి



నల్లగొండ జిల్లాలో మహిళా రైతులు, ఒంటరిమహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వారి ఆర్థిక స్వావలంభనకు, పురోభివృద్ధికి జిల్లా పాలనాయంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని కోరుతున్నాం. మేం జరిపిన అధ్యయనంలో నల్లగొండ జిల్లాలో మహిళారైతులు ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలు భూమి హక్కు లేకపోవడంతో నిర్మాణాత్మక హింసకు లోనవుతున్నారు. వారి ఎదుగుదలకు ప్రభుత్వం సహకరించాలి. ప్రధానంగా భూమి, నీటివనరులు కల్పించాలి. మార్కెటింగ్ అవకాశాలు కల్పించి వారి ఉత్పాదనలకు విలువ కల్పించాలి. చిన్నతరహాపరిశ్రమల ఏర్పాటుకు, స్వయం ఉపాధికి రుణాలందించాలి. ఒంటరి మహిళలకు పింఛన్లు, రేషన్‌కార్డులివ్వాలి. ఇతర అన్ని సహకారాలు అందించి ప్రణాళికాయుతంగా వారి వృద్ధికి తోడ్పడాలి.

– రుక్మిణీరావు, సామాజికవేత్త, నారీశక్తి పురస్కారగ్రహీత

నల్లగొండ, నల్లగొండ టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) ప్రభుత్వం ప్రణాళికయుతమైన మద్దతు అందించినప్పుడే మహిళా రైతులు, ఒంటరి మహిళలపై వ్యవస్థీకృత హింస కనుమరుగు అవుతుందని, ఆ దిశగా జిల్లా పాలనాయంత్రాంగాలు చర్యలు తీసుకోవాలని పలువురు సామాజిక వేత్తలు, మహిళా రైతులు అభిప్రాయపడ్డారు. మహిళా రైతులకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని, ప్రతిపథకాన్ని మహిళల దరిచేర్చడానికి సిద్ధంగా ఉన్నామని అధికారులు తెలిపారు. ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యంతో మహిళలు ఏదైనా సాధించగలరని జిల్లా ఉద్యాన శాఖ అధికారి సంగీతలక్ష్మి అన్నారు. "వ్యవసాయ సంక్షోభ నేపథ్యంలో మహిళా రైతులపై వ్యవస్థీకృత హింస: స్వభావం, రూపాలు" అనే అంశంపై నల్లగొండ జిల్లా కేంద్రంలో మహిళా కిసాన్ ఆధికార్ మంచ్, సాఫ్ఫేకామ్, గ్రామ్య రీసోర్స్ సెంటర్ ఫర్ ఉమెన్ సంస్థలు శనివారం వర్క్‌షాప్ నిర్వహించాయి. నారీశక్తి అవార్డు గ్రహీత, సామాజికవేత్త రుక్మిణీరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వర్క్‌షాప్‌లో పలువురు మహిళారైతులు, ఒంటరి మహిళలు తమ అనుభవాలను వివరించారు.

ఒంటరి మహిళగా ఎన్నో వేధింపులు ఎదుర్కొన్నా



భర్త చనిపోయిన తర్వాత నేను ఎన్నో అవస్థలు పడ్డా. ఇల్లు ఒకపక్కన కురుస్తుంటే ఇంకో పక్కన తలదాచుకున్న, నా భర్త బోర్ల మీద బోర్లు వేసి అప్పులపాలై దిక్కుతోచక ఆత్మహత్య చేసుకున్నాడు. మా అత్తమామలు నన్ను చాలా ఇబ్బందిపెట్టారు. అయినా తట్టుకొని నిలబడ్డా. నేనే సొంతంగా వ్యవసాయం చేసుకుంటున్నా, సొంతంగా ఇల్లు కూడా కట్టుకున్నా. పత్తి పంటలతో చాలా నష్టపోయాం. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నా.

– యాదమ్మ, మల్లారెడ్డిపల్లి, చింతపల్లి మండలం

జీవితాన్ని స్వశక్తితో నిలబెట్టుకున్నా



నాకు 14 ఏళ్ల వయసులో పెళ్లి చేశారు. నాకు 19 ఏళ్లప్పుడు నా భర్త కరెంటు షాక్‌తో చనిపోయాడు. ఆ తర్వాత ఎనిమిదేళ్లు మా అత్తమామల వద్దనే ఉన్నా, మా మరుదులతో సమానంగా నేను వ్యవసాయం చేసేదాన్ని, వాళ్లలాగే నాగలి పట్టా. మందుబస్తాలు మోశా. ఇంటిపనులు చేశా. అన్ని భరించాను. ఆస్తిలో నా వాటా నాకివ్వమని అడిగితే నన్ను, నా పిల్లలను ఇంటి నుంచి ఒంటిమీద బట్టలతో తరిమేశారు. బయటకు వచ్చి కష్టపడి నా పిల్లల్ని చదవించుకున్నా. నా కొడుకు నాకష్టం చూసి హాస్టల్‌లో ఉండి చదువుకున్నాడు. నా బిడ్డని కూడా చదివించా. రూ.12 కూలికి పోయి కుటుంబాన్ని పోషించుకున్నా. గవర్నమెంట్ ఇల్లొస్తే కట్టుకున్నా. నాబిడ్డలిద్దరికీ పెళ్లిళ్లు చేశా. అయిదెకరాల భూమి సాధించా. ఇప్పుడు నా మరుదులే నా వద్దకు వచ్చి అడిగితే వాళ్లకి సాగుకి రెండెకరాలిచ్చా. మిగిలిన మూడెకరాలు నేనే సొంతంగా వ్యవసాయం చేసుకుంటున్నా. కూరగాయలు సాగు చేస్తా. కోళ్లు పెంచుతా. నాజీవితాన్ని స్వశక్తితో నిలబెట్టుకున్నా. నాలాంటి ఒంటరి మహిళలకు ప్రభుత్వం ఆపదలో ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.

– అలివేలు, గొగిళ్లాపురం, చందంపేట మండలం, నల్లగొండ జిల్లా

గృహహింసకు లోనయ్యా, మాలాంటి వారిని ఆదుకోవాలి



నాకు 19 ఏళ్లప్పుడు పెళ్లి చేశారు. మా అత్తమామలతో నేను వేధింపులకు లోనయ్యాను. మా అమ్మవాళ్లింటి వెళితే కూడా ఇక్కడకు ఎందుకొచ్చావని, ఇరుగుపొరుగు సూటిమాటలతో వేధించారు. ఇంట్లో, బయట హింసకు లోనయ్యాను. ఒకదశలో డిప్రెషన్‌కు లోనవ్వాల్సి వచ్చింది. మాలాంటి వాళ్లకు ప్రభుత్వం అండగా ఉండాలి. మాకు ఇష్టం లేని పెళ్లిళ్లు, ఇష్టంలేని వృత్తులు కాకుండా నచ్చే పనులు చేసే అవకాశం కల్పించాలి. నాకు బ్యూటీషియన్ కావాలని ఉంది. అవసరమైన సహకారం ఇవ్వాలని కోరుతున్నా.

– లక్ష్మి, దేవరకొండ

మహిళా రైతులకు అన్నివిధాలా సహకరిస్తాం



నల్లగొండ జిల్లాలో మహిళా రైతులకు వ్యవసాయశాఖ తరుపున అన్నివిధాలా సహకారం అందిస్తాం. మహిళా రైతుల హక్కుల కోసం, ఒంటరిమహిళల అభ్యున్నతికి తీసుకోవాల్సిన చర్యలను సూచిస్తూ వర్క్‌షాప్ నిర్వహించడం అభినందనీయం. జిల్లాలో మహిళా గ్రూపులు ఇప్పటికే ఎంతో విజయవంతంగా ముందుకెళుతున్నాయి. మహిళా రైతులు సంఘటితంగా ముందుకొస్తే అన్నివిధాలా వారికి తోడ్పాటునందిస్తాం. ప్రధానంగా చిరు, తృణధాన్యాలు, ఇతర పంటలసాగు సమయంలో మహిళా రైతులు మార్కెటింగ్ వనరులు ఏర్పర్చుకున్నాకే ఆయా పంటలు సాగు చేస్తే ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉంటుంది. మార్కెటింగ్‌పై అవగాహన లేకుండా పంటలు పండిస్తే ఇబ్బంది పడాల్సివస్తుంది. జిల్లాలో ఉద్యానపంటల సాగులో మహిళారైతుల పాత్ర గణనీయంగా ఉంది. జిల్లా వ్యవసాయాశాఖ తరుపున మహిళారైతులకు అన్నివేళలా అందుబాటులోఉండి సహకారం అందిస్తాం.

– పి.శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

ఆత్మస్థైర్యంతో ఏదైనా సాధించవచ్చు



మహిళారైతులు, ఒంటరి మహిళలు నిరాశ, నిస్పృహలకు లోనుకాకూడదు. పట్టుదల, ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యంతో ఉంటే ఏదైనా సాధించవచ్చు. మహిళలకు తోడ్పాటు అందించేందుకు ప్రభుత్వం ఎన్నో రకాల పథకాలు అందజేస్తోంది. మహిళల రక్షణకూ పలు చట్టాలున్నాయి. మహిళా రైతులకు ఉద్యానవనశాఖ ద్వారా పూర్తిసహకారం అందిస్తాం. ఏవైనా శిక్షణ, ఇతర శాఖాపరమైన మద్దతు ఎల్లవేళలా అందిస్తాం. పూలసాగు, కూరగాయల సాగు విషయంలో మహిళా రైతులను ప్రోత్సహిస్తున్నాం. మహిళారైతులు గ్రూపులుగా ఏర్పడి మార్కెటింగ్ నైపుణ్యాలను పెంచుకుంటే ఆర్థికంగా ఎదిగే అవకాశం ఉంది. ఆ దిశగా ప్రయత్నిస్తే మావంతు సహకారం అందిస్తాం.

– సంగీతలక్ష్మి, జిల్లా ఉద్యాన శాఖాధికారి

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా, పదో తరగతి విద్యార్థి గాయపడ్డాడు. నల్లగొండ జిల్లా కనగల్ మండలంలో జరిగిన ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి చెందారు.



భూక్యా నాగు(ఫైల్)

మిర్యాలగూడ అర్బన్, మార్చి 19 : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ప్రాంతంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు దుర్మరణం చెందాడు. రూరల్ ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దామరచర్ల మండలం లావూరిభూక్యాతండాకు చెందిన భూక్యా నాగు(22) డెకరేషన్ వర్క్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పనిముగించుకొని బైక్‌పై స్నేహితుడు రత్నావత్ దావీద్‌తో కలిసి ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై కిష్టాపురం వద్ద గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో బైక్ నడుపుతున్న నాగు తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, దావీద్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని మంగళవారం కుటుంబసభ్యులకు అప్పగించారు. నాగు బావ ధరావత్ సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కనగల్‌లో ఉపాధ్యాయుడు



సాజీదాలీ(ఫైల్)

కనగల్, మార్చి 19 : నల్లగొండ జిల్లా కనగల్ గ్రామశివారులో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందాడు. ఎస్ఐ రామకృష్ణాగౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ మండలం పానగల్ ప్రాంతానికి చెందిన సాజీదాలీ కనగల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీనియర్ ఉపాధ్యాయుడు(ఫిజికల్ డైరెక్టర్) పనిచేస్తున్నాడు. గుర్రంపోడు మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో పదో తరగతి పరీక్షలకు డిపార్ట్‌మెంట్ అధికారిగా విధులకు హాజరైన సాజీదాలీ మంగళవారం సాయంత్రం బైక్‌పై నల్లగొండకు బయలుదేరాడు. ఈ క్రమంలో కనగల్ గ్రామశివారులో ఎదురుగా వస్తున్న గడ్డి ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో సాజీదాలీ తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించి అప్పటికే అతను మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

స్కూల్ వ్యాన్, బైక్ ఢీకొని విద్యార్థికి తీవ్రగాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాంజయంత్

గరిడేపల్లి, మార్చి 19: స్కూల్ వ్యాన్, బైక్‌ను ఢీకొన్న ఘటనలో పదో తరగతి విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలో మంగళవారం ఈ ఘటన జరిగింది. స్థానికుల ప్రకారం.. గరిడేపల్లి మండలంలోని పొనుగోడు గ్రామానికి చెందిన రాంజయంత్ పొనుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షకు హాజరై తిరిగి బైక్‌పై పొనుగోడుకు వస్తున్నాడు. గరిడేపల్లి, పొనుగోడు గ్రామాల మధ్య సూర్యాపేట రహదారిపై ఎదురుగా వస్తున్న నేరేడుచర్లకు చెందిన స్కూల్ వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న రాంజయంత్ కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించగా, సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై పోలీసులను వివరణ అడగగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

10 గంటల పాటు నిలిచిన విద్యుత్ సరఫరా

కోతులగుంపుతో శాలిగౌరారం సబ్‌స్టేషన్‌లో పేలిన సీటీ

ఇబ్బందులు పడ్డ 15 గ్రామాల ప్రజలు ● నిలిచిన విద్యుత్ సరఫరా



సబ్‌స్టేషన్‌లో ఖాళీపోయిన సీటీ

శాలిగౌరారం, మార్చి 19 : నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్(సీటీ) పేలి 15 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉదయం 10 గంటలకు సంఘటన చోటుచేసుకోగా రాత్రి 8 గంటల ప్రాంతంలో నల్లగొండ నుంచి సీటీ తెప్పించి ఏర్పాటు చేశారు. 10 గంటల పాటు 15 గ్రామాలు విద్యుత్ సరఫరా లేక ఇబ్బందులు పడ్డారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. శాలిగౌరారంలోని సబ్‌స్టేషన్‌లోకి మంగళవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో పెద్దఎత్తున కోతుల సమూహం చొరబడింది. ఈ క్రమంలో ఓ కోతికి తీగలు తగిలి సబ్‌స్టేషన్‌లోని సీటీ పేలి పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. ఈ ఘటనతో మిగతా కోతులు పరారయ్యాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వెంటనే సిబ్బంది మంటలను చల్లార్చారు. ఏఈ శ్రీధర్ సబ్‌స్టేషన్‌కు చేరుకుని నూతన సీటిని నల్లగొండ నుంచి తెప్పించి రాత్రి 8 గంటలకు ఏర్పాటుచేశారు. కాలిపోయిన సీటి విలువ రూ.20వేల వరకు ఉంటుందన్నారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో దాదాపు 15 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కోతుల చొరబడి ప్రతీ సందర్భంలోనూ సీటీలు ఖాళీపోవడం అటు నష్టంతో పాటు విద్యుత్ సరఫరా నిలిచి ప్రజలు ఇబ్బంది పడటం తరుచూ జరుగుతోంది. కోతులు సబ్‌స్టేషన్‌లోకి వెళ్లకుండా సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇరువర్గాల మధ్య ఆరుగురికి గాయాలు

భువనగిరి రూరల్, మార్చి 19 : పాత కక్షల నేపథ్యంలో ఇరువర్గాలు గొడ్డలి, కర్రలతో దాడి చేసుకున్న సంఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం వడపర్తిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వడపర్తి గ్రామానికి చెందిన మేడబోయిన సత్తయ్యకు చెందిన పశువులు ఎలిమినేటి పద్మారెడ్డి వరి చేనులో మేస్తుండడంతో పద్మారెడ్డి దూషణలకు దిగాడు. పక్కనే ఉన్న సత్తయ్య, అతడి కుమారుడు బాలమల్లేష్, గోపాలకృష్ణలు గొడ్డలితో దాడి చేయడంతో అక్కడనే ఉన్న పద్మారెడ్డి భార్య కళమ్మ, కుమారుడు సంతోష్‌రెడ్డి, అడ్డుపడడంతో వారిపై కూడా దాడికి దిగారు. ప్రతీగా వీరు కూడా సత్తయ్య, బాల మల్లేష్, గోపాల కృష్ణలపై కర్రలతో దాడి చేశారు. ఈ ఘర్షణలో పద్మారెడ్డి, సంతోష్‌రెడ్డి తీవ్రంగా, బాలమల్లేష్, గోపాలకృష్ణ స్వల్పంగా గాయపడ్డారు. తీవ్రంగా గాయనపడిన ఎలిమినేటి కళమ్మ, పద్మారెడ్డి, సంతోష్‌రెడ్డిలను మెరుగైన వైద్యసేవల కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడిన బాలమల్లేష్, గోపాల కృష్ణ, సత్తయ్యలు భువనగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

గుట్టపై నేత్రపర్వంగా రథోత్సవం



భక్తుల సందోహం మధ్య తిరువీధుల్లో రథోత్సవం

యాదగిరిగుట్ట, మార్చి 19 : ఏకశిఖర వాసుడు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి కల్యాణలక్ష్మీ నరసింహుడు దివ్య విమానరథంలో భక్తులకు దర్శనమిచ్చి తరింపజేశాడు. జగత్ కల్యాణం..విశ్వశాంతి కోసం నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో దివ్యవిమాన రథోత్సవం శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో రాత్రి వేళ మూలమూర్తులకు మహానివేదనల అనంతరం వైభవంగా కొనసాగింది. వివిధరకాల పుష్పాలు, మామిడి, అరటి ఆకుల తోరణలతో స్వామివారి దివ్యవిమాన రథాన్ని శోభాయామానంగా అలంకరించారు. ప్రధానాలయ పడమటి సప్తతల మహారాజగోపురం వద్ద అర్చకబృందం విశ్వక్సేనుడికి తొలి పూజలతో రథాంగ హోమం, రథాంగబలి, దిష్టికుంభ పూజలు నిర్వహించారు. పట్టువస్త్రాలు, బంగారు, వెండి, ముత్యాల ఆభరణాలతో నూతన కల్యాణ దంపతులైన లక్ష్మీ, నారసింహులను దివ్యమనోహరంగా అలంకరించి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ దివ్యవిమాన రథంపై అధిష్ఠింపజేశారు. రుత్వికులు, అర్చకబృందం వేదపారాయణాలు, మూల మంత్ర జప పఠనాలు, వేదమంత్రాలతో రథాంగ హోమ పూజలు జరిపి రథస్థ లక్ష్మీనారసింహుడికి హారతి నివేదించారు. వేద మంత్ర పఠనాలు, భక్తుల జయజయ ధ్వానాల నడుమ లక్ష్మీనృసింహుడిని దివ్యవిమాన రథంపై విహరింపజేసే ఘట్టాలు నేత్రపర్వంగా సాగాయి. రథాంగ రూఢుడైన లక్ష్మీనృసింహుడి దివ్యవిమాన రథోత్సవంలో భక్తజనులు దర్శించుకుని తరించారు. రథస్థ కేశవుడిని దర్శించుకుంటే పునర్జన్మ ఉండదని భక్తుల విశ్వాసం. స్వామివారి రథోత్సవంలో పాల్గొనేందుకు యాత్రాజనులు తండోపతండాలుగా తరలి వచ్చారు. స్వామివారి దివ్య విమాన రథోత్సవ పర్వాలను దేవస్థాన ప్రధానార్చకులు నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, అర్చకబృందం ఆధ్వర్యంలో సంప్రదాయరీతిలో నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ అనువంశీఖ ధర్మకర్త బీ నరసింహమూర్తి, ఈవో ఏ భాస్కర్‌రావు, దేవస్థాన సిబ్బంది, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



రథాన్ని లాగుతున్న ఆలయ అధికారులు

మల్లు స్వరాజ్యం ఆశయాలను సాధించాలి


కోదాడలో మల్లు స్వరాజ్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

» సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి


సూర్యాపేటలో మల్లు స్వరాజ్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మల్లు నాగార్జునరెడ్డి, సీపీఎం నాయకులు

సూర్యాపేట సిటీ, మార్చి 19: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే మల్లు స్వరాజ్యం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేటలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్‌లో మల్లు స్వరాజ్యం ద్వితీయ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణలో జరిగిన వీర తెలంగాణ సాయుధ పోరాటంలో మల్లు స్వరాజ్యం కీలక భూమిక పోషించారన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం తుపాకీ చేతపట్టి దొరలు, భూస్వాములు, దేశ్‌ముఖ్‌లకు వ్యతిరేకంగా పోరాటం చేశారని కొనియాడారు. అనంతరం మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు పాల్గొన్నారు.

సీపీఎం నేతల ఆధ్వర్యంలో..

●మేళ్లచెర్వులో పట్టెపు సైదులు, హుజూర్‌నగర్‌లో పోసన బోయిన హుస్సేన్, నేరేడుచర్లలో పారేపల్లి శేఖర్ రావు, కొదమగుండ్ల నగేష్, మఠంపల్లిలో భూక్యా పాండు నాయక్, మునగాలలో మహిళా సంఘం అధ్యక్షురాలు ఎస్‌కే ఖాజాబీ, తుంగతుర్తిలో కొలిశెట్టి యాదగిరిరావు, కోదాడలో మేదరమెట్ల వెంకటేశ్వరరావు, నాగారంలో దేవరకొండ యాదగిరి ఆధ్వర్యంలో మల్లు స్వరాజ్యం వర్ధంతిని నిర్వహించారు. ఆ సందర్భంగా ఆమె చిత్రపటాలకు నివాళులర్పించి, రాష్ట్రానికి చేసిన సేవలను పలువురు కొనియాడారు.

మల్లు స్వరాజ్యం స్మారక కళావేదిక ప్రారంభం

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం జీవితం స్ఫూర్తిదాయకమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. సూర్యాపేటలోని 11వ వార్డు రాయినిగూడెంలో మల్లు స్వరాజ్యం జ్ఞాపకార్థం ఆమె కుటుంబ సభ్యులు నిర్మించిన మల్లు స్వరాజ్యం స్మారక కళావేదికను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మల్లు నాగార్జున్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాదూరి కరుణ, నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, కోటగోపి, కౌన్సిలర్ ఎల్ల గంగాభవాని, వెంకటేశ్వర్‌రావు, ఏకలక్ష్మి, మల్లు అరుణ్, మేకనబోయిన శేఖర్, వెంకటేశం, ముత్యాల పిచ్చయ్య పాల్గొన్నారు.


తుంగతుర్తిలో మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు


హుజూర్‌నగర్‌లో మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



సూర్యాపేటలోని రాయినిగూడెంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

నేడు తిరుమలగిరిలో 144 సెక్షన్

తిరుమలగిరి, మార్చి 19: తిరుమలగిరి మునిసిపల్ కార్యాలయంలో చైర్మన్, వైస్‌చైర్మన్‌పై ప్రవేశపెట్టనున్న అవిశ్వాస తీర్మానం సందర్భంగా మునిసిపల్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో 144సెక్షన్ విధించినట్లు ఆర్డీవో వేణుమాధవరావు తెలిపారు.

గేట్ పరీక్షలో మండలవాసికి 1027వ ర్యాంకు


రాజీవ్

గరిడేపల్లి, మార్చి 19: జాతీయ స్థాయిలో నిర్వహించిన గేట్ పరీక్షలో మండలంలోని రాయినిగూడెం గ్రామానికి చెందిన గుండు వెంకటనారాయణ, రాంబాయమ్మ దంపతుల కుమారుడు రాజీవ్ 1027వ ర్యాంకు సాధించాడు. రాజీవ్ ప్రస్తుతం ఉస్మానియా యూనివర్శిటీలో క్యాంపస్ ఇంజనీరింగ్ కాలేజీలో ఈసీఈ విభాగంలో ఎంటెక్ అభ్యసిస్తున్నాడు. సాధారణ గీత కార్మికుడి కుటుంబానికి చెందిన రాజీవ్ జాతీయ స్థాయిలో ర్యాంకు సాధించడం తమ గ్రామానికి గర్వకారణమని మాజీ సర్పంచ్ గుండు గుర్వయ్య అన్నారు. విద్యార్థిని ఆయన అభినందించారు.

అభివృద్ధి పనులకు రూ.56 కోట్లు మంజూరు

కోదాడ, మార్చి 19: కోదాడ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు రూ.56కోట్లు మంజూరయ్యాయి. కోదాడ నియోజకవర్గంలో 35 బీటీ రోడ్లు, ఎనిమిది వంతెనలను నిర్మించేందుకు ఈ నిధులను మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి మంజూరు చేశారు. రూ.22.50 కోట్లతో 15 బీటీ రోడ్ల పునర్నిర్మాణం, సీఆర్ఆర్ గ్రాంట్‌కు చెందిన రూ.22.76కోట్లతో పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో 20 కొత్త బీటీ రోడ్లను నిర్మించనున్నారు. అదేవిధంగా రూ.10.90కోట్లతో ఎనిమిది వంతెనలను నిర్మించనున్నారు. మునగాల, నడిగూడెం, మోతె, కోదాడ, చిలుకూరు, అనంతగిరి మండలాల్లో బీటీ రోడ్లను నిర్మిస్తున్నారు రూ.1.50కోట్లతో గణపవరం, కాపుగల్లు సబ్‌స్టేషన్ రోడ్డులో హైలెవల్ వంతెన, రూ.1.50 కోట్లతో సీతారామతండా, బూరుగడ్డ రోడ్డుపై వంతెన, రూ.1.50 కోట్లతో బేతవోలు, ఆచారులగూడెం రోడ్డుపై వంతెన, రూ.1.20 కోట్లతో నారాయణపురం, తొగర్రాయి రోడ్డుపై వంతెన, రూ.1.70 కోట్లతో దుబ్బ నర్సింహులగూడెం, నేరేడువాయి రోడ్డుపై వంతెన రూ.కోటితో ఎన్‌హెచ్9 చీర్యాల రోడ్డుపై వంతెన, రూ.1.50 కోట్లతో మాధవరం, బత్తులాపురం రోడ్డుపై వంతెన, రూ.కోటితో మునగాల, తాడ్వాయి రోడ్డు వంతెనను నిర్మించనున్నారు.

నేడు హుజూర్‌నగర్‌లో బీఆర్ఎస్ సమావేశం

నేరేడుచర్ల, మార్చి 19: హుజూర్‌నగర్‌లోని శ్రీలక్ష్మీ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహిస్తున్నట్లు డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అరబండి సురేష్‌బాబు తెలిపారు. మంగళవారం నేరేడుచర్ల బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశానికి ఈ పార్టీ కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జయబాబు, చిత్తలూరి సైదులు, సుదర్శన్, పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

'మాదిగ సామాజికవర్గానికి మూడు సీట్లు కేటాయించాలి'

హుజూర్‌నగర్, మార్చి 19: పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని పార్టీలు మాదిగ సామాజిక వర్గానికి మూడు సీట్లు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పల్లేటి లక్ష్మణ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింతా బాబు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని టౌన్‌హాల్‌లో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో వారు మాట్లాడారు. మాదిగలకు పార్లమెంట్ ఎన్నికల్లో స్థానాలు కేటాయించకపోతే తగిన మూల్యం చెల్లిస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో విజయభాస్కర్, ముక్కంటి, ఉపేందర్, రాము, మహేష్, సైదులు, శంకర్, గోపి పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

హుజూర్‌నగర్, మార్చి 19: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చురుకుగా పనిచేయాలని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కుక్కడపు మహేష్ కోరారు. మంగళవారం పట్టణంలోని ఇందిర భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో బాలకృష్ణ, రాము, హరికృష్ణ, గణపతి, గోపి, రామ్మూర్తి పాల్గొన్నారు.

మెకానిక్‌కు సంక్షేమ సంఘం చేయూత

తిరుమలగిరి, మార్చి 19: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మెకానిక్‌కు సంక్షేమ సంఘం చేయూతనందించింది. ఇటీవల జరిగిన ప్రమాదంలో తిరుమలగిరికి చెందిన టూవీలర్ మెకానిక్ సుధాకర్‌కు కాలు విరిగింది. దీంతో సుధాకర్‌కు టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం రూ.47,500 ఆర్థికసాయం అందజేసి చేయూతనందించారు. కార్యక్రమంలో నవీన్‌కుమార్, రాము, నాగరాజు, పూర్ణ, బాలకృష్ణ వీరన్న, సతీష్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నేపథ్యంలో పోలీసుల కవాతు

మేళ్లచెర్వు, మార్చి 19: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మంగళవారం మండల కేంద్రంలో పోలీసులు కవాతు నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఆంజనేయస్వామి గుడి నుంచి బస్టాండ్ మీదుగా పెట్రోల్ బంక్ వరకు పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ కవాతులో కోదాడ రూరల్ సీఐ రంజితారెడ్డి, స్థానిక ఎస్‌ఐ పరమేష్, కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అందరూ సహకరించాలని పెన్‌పహాడ్ ఎస్‌ఐ పేరక రవీందర్ కోరారు. మండలంలోని సమస్యాత్మకమైన నాగులపాటి అన్నారం, అన్నారం బ్రిడ్జి గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్ బలగాలు కవాతు నిర్వహించాయి. కార్యక్రమంలో చివ్వెంల ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎన్నికలు కీలకం

కోదాడ టౌన్, మార్చి 19: ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎన్నికలు కీలకమని సమాచార హక్కు పరిరక్షణ సమితి ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం కోదాడలో ఓ ప్రైవేట్ కళాశాలలో సమాచార హక్కు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటరు అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఓట్ల కోసం ప్రలోభ పెట్టే వారిపై సీవిజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సూర్యనారాయణ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, ఉషారాణి, బాణాల వసంత, శ్రీనివాస్, ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

గరిడేపల్లి, మార్చి 19: గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు షేక్ యాకుబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పొనుగోడు గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 21న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రాజు, సత్యం, హరీష్ పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల మాస కల్యాణం

సూర్యాపేట అర్బన్, మార్చి 19: జిల్లా కేంద్రంలోని వేదాంత భజనమందిరంలో పునర్వసు నక్షత్రం సందర్భంగా మంగళవారం సీతారాముల మాస కల్యాణాన్ని పూజారులు వైభవంగా నిర్వహించారు. దేవతామూర్తులకు పంచామృతాలతో అభిషేకం చేశారు. దేవాలయ అర్చకులు దరూరి సింగరాచార్యులు, రఘువాచార్యులు ఆధర్యంతో శాస్త్రోక్తంగా కల్యాణాన్ని నిర్వహించి, అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో భజనమందిరం అధ్యక్షుడు రాచర్ల వెంకటేశ్వరరావు, నకిరేకంటి నాగరాజు, అశోక్, సుమన్, ధనుంజయ్, పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా నృసింహుని కల్యాణోత్సవం

మఠంపల్లి, మార్చి 19: మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో శ్రీలక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

జాతరకు అంకమ్మ తల్లి ఆలయం ముస్తాబు

కోదాడ రూరల్, మార్చి 19: హోలీ పండుగ రోజు జాతరను నిర్వహించడానికి మండలంలోని దొరకుంట గ్రామంలో అంకమ్మతల్లి ఆలయాన్ని ముస్తాబు చేశారు. హోలీ పండుగ రోజు అమ్మవారికి బోనాలు, నైవేద్యాలు, మొక్కులు చెల్లించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా జాతరను వైభవంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఏర్పాట్లు చేశారు.

నేటి నుంచి రేపాల నృసింహుని బ్రహ్మోత్సవాలు

మునగాల రూరల్, మార్చి 19: మండలంలోని రేపాల శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమవుతున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సారిక రామయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సిరిపురం గ్రామం నుంచి స్వాముల ఉత్సవ విగ్రహాలను బుధవారం తెల్లవారుజామున మేళ తాళాలతో, కాగడాల ప్రదర్శనతో ఊరేగింపుగా రేపాల గ్రామానికి తీసుకువస్తామన్నారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నాగారం, మార్చి 19: మండలంలోని ఫణిగిరి గ్రామంలో ఉన్న శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 31వ తేదీ వరకు ఈ ఉత్సవాలు కొనసాగనున్నాయని ఆయన కమిటీ చైర్మన్ గట్టు లక్ష్మీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా స్వామి కల్యాణం, అభిషేకాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

ఐదెకరాల గడ్డివాము దగ్ధం

మఠంపల్లి, మార్చి 19 : ప్రమాదవశాత్తు యాతవాకిళ్ల గ్రామంలో ఐదెకరాల గడ్డివాము మంగళవారం దగ్ధమైంది. గ్రామానికి చెందిన సలీం మూగజీవాల కోసం ఐదెకరాల గడ్డిని గ్రామ సమీపంలో నిల్వచేశారు. మంగళవారం మధ్యాహ్నం గడ్డివాము నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగి అగ్నికి ఆహుతయ్యాయి. గడ్డి విలువ సుమారు రూ.30వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అనంతగిరి, మార్చి 19 : తండ్రి మందలించాడని ఆత్మహత్యాయత్నం చేసిన కుమారుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని అమీనాబాద్ గ్రామానికి చెందిన మేళ్లచెర్వు వెంకటేశ్వర్లు(30) మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో తరుచూ ఘర్షణ పడేవాడు. మద్యం మానుకోవాలని తండ్రి సైదయ్య మందలించడంతో నాలుగు రోజుల కిందట పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని ఎస్‌ఐ తెలిపారు. వెంకటేశ్వర్లుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తిరుమలగిరి, మార్చి 19 : అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను, ఆటోలో తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఇసుక ట్రాక్టర్లు, రేషన్ బియ్యం తరలిస్తుండగా ఆటోలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్ తరలించినట్లు తెలిపారు.

బార్ అసోసియేషన్ల ఎన్నికలకు ముగిసిన నామినేషన్లు

హుజూర్‌నగర్, కోదాడ టౌన్, మార్చి 19: హుజూర్‌నగర్ పట్టణంలో ఈనెల 26న నిర్వహిస్తున్న బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ ముగిసినట్లు ఎన్నికల అధికారులు సుందర రాఘవరావు, వట్టికూటి అంజయ్య తెలిపారు. మంగళవారం పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడుతూ అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శి, గ్రంథాలయ కార్యదర్శి పదవులకు ఒకరు చొప్పున, కార్యవర్గ సభ్యులుగా నలుగురికి, మొత్తం 11పోస్టులకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా అధ్యక్ష పదవికి రెండు నామినేషన్లు, ఉపాధ్యక్షుడికి నాలుగు, ప్రధాన కార్యదర్శికి ఐదు, జాయింట్ సెక్రటరీకి నాలుగు, కోశాధికారి పదవికి ఒకటి, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శి పదవికి మూడు, గ్రంథాలయ కార్యదర్శికి రెండు, కార్యవర్గ సభ్యుల పదవులకు ఏడుగురు మొత్తం 28మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు. బుధవారం నామినేషన్లను పరిశీలిస్తామని, అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు.ఏకగ్రీవంగా కార్యవర్గాన్ని ఎంపిక చేసేందుకు పలువురు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

● కోదాడ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక కోసం ఈ నెల 28న నిర్వహించే ఎన్నికల ప్రక్రియ ముగిసింది. నామినేషన్ల ప్రక్రియలో భాగంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి ఆరుగురు, ప్రధాన కార్యదర్శికి ఆరుగురు, సంయుక్త కార్యదర్శికి నలుగురు, కోశాధికారికి నలుగురు, గ్రంథాలయ కార్యదర్శికి ముగ్గురు, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శికి ముగ్గురు, మూడు కార్యవర్గ సభ్యుల పదవులకు ఆరుగురు నామినేషన్ దాఖలు చేశారు. మొత్తం తొమ్మిది కార్యవర్గ సభ్యులకు 32మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నెల 21న నామినేషన్ల పరిశీలిస్తామని ప్రధాన ఎన్నిక అధికారి వేజెళ్ల రంగారావు, ఉప ఎన్నికల అధికారి షేక్ జానీపాషా, సహాయ ఎన్నికల అధికారి ఆవుల మల్లికార్జున్‌రావు తెలిపారు. 22వ తేదీన నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉందని, 28వ తేదీన ఎన్నికలు నిర్వహించి అదే రోజు సాయంత్రం కౌంటింగ్ నిర్వహించి విజేతలను ప్రకటిస్తామన్నారు.

చెన్నకేశవస్వామి అవతారంలో శ్రీరాముడు దర్శనం

కోదాడ టౌన్, మార్చి 19: కోదాడ పట్టణంలో పునర్నిర్మించిన శ్రీకోదండ రామస్వామి దేవాలయంలో విగ్రహాల ప్రతిష్ఠోత్సవ పూజలు నాలుగో రోజు మంగళవారం వైభవంగా కొనసాగాయి. శ్రీరాముడు చెన్నకేశవస్వామి అవతారంలో పంచాయుధాలు ధరించి భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుంచే వేద పండితులు విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. ఆంజనేయస్వామికి విశేష అభిషేకాలను కనుల పండుగగా నిర్వహించారు. యాగంలో మునిసిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, రమేష్ దంపతులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం బుధవారం ప్రతిష్ఠించే దేవతల విగ్రహాలను దేవాలయం వద్దకు ఊరేగింపుగా భక్తులు, పూజారులు తీసుకువెళ్లారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు, పాల్గొన్న భక్తులు

పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి


ఆత్మకూర్(ఎస్)లో ఎండిపోయిన వరి పైరులో నిరసన వ్యక్తం చేస్తున్న అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు

ఆత్మకూర్(ఎస్), మార్చి 19: పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25వేలు నష్టపరిహారం చెల్లించాలని, రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీని వర్తింపజేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆత్మకూర్(ఎస్) మండలం కేంద్రంలో, మండలంలోని ఖాసీగూడలో ఎండిపోయిన వరిపైర్లను ఆ సంఘం నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సారెస్పీ చివరి ఆయకట్టు వరకు సాగునీరందక గ్రామాల్లో వరి పైర్లు ఎండి, రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఎస్సారెస్పీ నీటిపై అధికారుల పర్యవేక్షణ లేనందున చివరి ఆయకట్టుకు నీరందలేదన్నారు. వ్యవసాయాధికారులు, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనాలు వేయాలన్నారు. క్వింటాకు రూ.500లు బోనస్ కల్పించి, ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో గంట నాగయ్య, కునుంట్ల సైదులు, ఎస్‌కే షైబెల్లి, పోరెండ్ల దశరథ, సామ నర్సిరెడ్డి, డేగల వెంకటకృష్ణ, ఎర్ర ఉమేష్, సంజీవరెడ్డి, తాళ్లపల్లి లింగయ్య, ఉప్పల పిచ్చయ్య, చిత్తలూరి వెంకన్న పాల్గొన్నారు.

మత్స్యసహకార సంఘం ఎన్నికపై ఉత్కంఠ

నేడు మఠంపల్లి సంఘానికి ఎన్నికలు


మఠంపల్లి, మార్చి 19: హుజూర్‌నగర్ నియోజకవర్గంలోనే ప్రధానమైన మఠంపల్లి మత్స్య సహకార సంఘం ఎన్నికపై ఉత్కంఠ నెలకొంది. బుధవారం నిర్వహించే సంఘం ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు చేయగా, పోటీకి పలువురు సిద్ధమయ్యారు. సంఘంలో వర్గపోరు ఉండటంతో ఎన్నికను ఇరువర్గాలు ప్రతి ష్ఠాత్మకంగా తీసుకున్నాయి. మఠంపల్లి ఊర చెరువులో 281 మంది సభ్యులు ఉండగా తొమ్మిది మందితో పాలకవర్గాన్ని ఎన్నుకుంటారు. అయితే 28మంది పోటీ చేస్తున్నట్లు సమాచారం. ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లను పూర్తి చేసినట్లు కోఆపరేటివ్ రిజిస్ట్రార్, ఎన్నికల అధికారి అశోక్‌కుమార్ తెలిపారు. రహస్య ఓటింగ్ పద్ధతి ద్వారా ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆ ముగ్గురి స్ఫూర్తితో పోరాడాలి

గరిడేపల్లి, మార్చి 19: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగం చేసిన భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్ స్ఫూర్తితో నేటి యువత ప్రజా సమస్యలపై పోరాడాలని పీవైఎల్ జిల్లా కార్యదర్శి డి.రవి అన్నారు. మంగళవారం మండలంలోని వెలిదండ గ్రామంలో నిర్వహించిన భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఉదయ్, విక్రమ్, నరేష్ పాల్గొన్నారు.

మంచినీటి సరఫరాపై దృష్టి సారించాలి

గరిడేపల్లి, మార్చి 19: గ్రామాల్లో అధికారులు మంచినీటి సరఫరా, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి సురేష్ అన్నారు. మంగళవారం మండలంలోని మర్రికుంట గ్రామాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశంలోఇంటి పన్ను వసూలుపై రివ్యూ నిర్వహించారు.



సూర్యాపేట క్రైం: పిల్లల నడవడికపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని సూర్యాపేట పీటీం ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని 60అడుగుల రోడ్డు, విద్యానగర్, ఎంజీ రోడ్డులో అతివేగంగా వాహనాలు నడుపుతూ ఇతరులకు ఇబ్బంది కలిగిస్తున్న యువకులను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆకతాయి పనులతో భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని, చదువుపై దృషి సారించాలని సూచించారు.

పెన్‌పహాడ్: హరితహారం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం లోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో తహసీల్దార్ మహేందర్ రెడ్డి మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లాల్ నాయక్, ఆర్ఐ స్వప్న, సూపరింటెండెంట్ చెన్న కృష్ణారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ సునీత, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● పెన్‌పహాడ్ మండల కేంద్రంలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న రెండు పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు హరిసింగ్, యర్రంశెట్టి రాంబాబు, తహసీల్దార్ మహేందర్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు పరిశీలించి, తనిఖీలు చేశారు. ఈ రెండు కేంద్రాల్లో 325 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈవో నకిరేకంటి రవి తెలిపారు.

హుజూర్‌నగర్: మండలంలోని గోపాలపురంలో విద్యుత్ లైన్లను వెంటనే మార్చాలని న్యాయవాది కాలువ శ్రీనివాసరావు కోరారు. మంగళవారం గ్రామంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బూరుగడ్డ రోడ్డులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక లోపంతో హైఓల్టేజీ సరఫరా అవుతోందని, దీంతో గృహాల్లోని ఫ్యాన్లు, మోటార్లు, టీవీలు కాలిపోతున్నాయని, ఇంటి గోడలకు విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదన్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

● దేశంలో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి చందర్‌రావు కోరారు. పట్టణంలోని ఇఫ్టూ కార్యాలయంలో భగత్‌సింగ్ వర్ధంతి పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో రాకేష్, అనిల్, శివకుమార్, బాలకృష్ణ, జశ్వంత్, నాగరాజు, అనిల్, సంతోష్, వివేక్, మణిదీప్ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ రూరల్: పట్టణంలోని జీప్సీ అనాథాశ్రమానికి ప్రాణిక్ హీలింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. అదేవిధంగా మాధవరాయనిగూడెం సమీపంలోని జంగాలగూడెం కాలనీలో 50 మంది పేదలకు అన్నదానం చేశారు. తిలక్‌నగర్‌కు చెందిన సుతారి మేస్త్రీ కొలుకులపల్లి సుధాకర్ కుటుంబానికి 25కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, అంజయ్య రాజేష్, వెంకటేశ్వర్లు, కనకారావు, ఓపెన్ ఐస్ సొసైటీ కార్యదర్శి సులువ శ్రీను, బాబూరావు, ధన్‌పాల్ పాల్గొన్నారు.

మఠంపల్లి: రాష్ట్ర ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం సంతోషదాయకమని రెడ్డి జేఏసీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కర్నాటి తరుణ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మఠంపల్లిలో యువజన సంఘం సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

● కోదాడ డివిజన్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన జిలానిని హుజూర్‌నగర్‌లో లారీ అసోసియేషన్ హుజూర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు కోతి సంపత్‌రెడ్డి, ఇంద్రారెడ్డి, శంకర్‌రావు సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనివాసరాజు, శ్రీనివాస్‌పాల్గొన్నారు.

తిరుమలగిరి: తిరుమలగిరి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో వేణుమాధవరావు మంగళవారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట డీటీ జాన్‌మహ్మద్ ఉన్నారు.

● తిరుమలగిరి సబ్‌స్టేషన్ పరిధిలోని నెల్లిబండతండా ఫీడర్ ప్రాంతాల్లో విద్యుత్ తీగలకు అడ్డుగా చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున బుధవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వేణుగోపాల్ తెలిపారు.

తుంగతుర్తి: పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి నరేష్ కోరారు. మండలంలోని సంగెం గ్రామంలో 120 పశువులకు టీకాలు వేయించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ రవి, గోపాలమిత్ర శ్రీనివాస్‌రెడ్డి, పశుమిత్ర గణిత గణేష్ తదితరులు పాల్గొన్నారు.